సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
బుధవారం । 20 । నవంబర్ । 2024



సోమశిలలో 70.565 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో మంగళవారం 70.565 టీఎంసీల నీరు ఉంది. పెన్నార్ డెల్టాకు 50, కండలేరుకు 2600, ఉత్తర, దక్షిణ కాలువలకు 1100 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.78,130
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.7,088
మూడు శాతం జీఎస్టీతో	రూ.7,301
నవర (8 గ్రాములు)	రూ.58,408

గరిష్టం/కనిష్టం 31.5 /24.4

వాతావరణం

జిల్లాలో బుధవారం వాతావరణం పొడిగా ఉంటుంది. అక్కడక్కడ ఆకాశం పాక్షికంగా మేఘావృతంగా ఉండే అవకాశం. మంగళవారం గాలిలో తేమ 70 శాతం ఉంది.

న్యూస్‌రీల్

జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారిగా వెంకటలక్ష్మమ్మ

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ జిల్లా అధికారిగా పి వెంకటలక్ష్మమ్మను నియమిస్తూ బీసీ సంక్షేమశాఖ డైరెక్టర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె కర్నూలు జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారిగా ఇప్పటి వరకు విధులు నిర్వహిస్తున్నారు. వెంకటలక్ష్మమ్మ సాధారణ బదిలీపై జిల్లాకు రానున్నారు.

ఆర్టీసీని అభివృద్ధి పథంలో నడిపిస్తా

- ఆర్టీసీ నెల్లూరు జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి



మాట్లాడుతున్న సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి

నెల్లూరు రూరల్: జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేల సహకారంతో ఆర్టీసీని అభివృద్ధి పథంలో నడిపిస్తానని, సంస్థ ఉద్యోగులు, కార్మికులు, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆర్టీసీ నెల్లూరు జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి చెప్పారు. మంగళవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 21న ఆర్టీసీ రీజినల్ కేంద్రం నెల్లూరులో తాను జోనల్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు వెల్లడించారు. జిల్లాలో కొన్ని ప్రాంతాలకు ఇప్పటికీ బస్సు సర్వీసులు లేవని, ప్రతి గ్రామానికి బస్సు సౌకర్యం ఉండేలా పాటు పడతానన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు శీపారెడ్డి వంశీధర్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కందికట్ల రాజేశ్వరి, మిడతల రమేష్, గడ్డం విజయ్‌కుమార్, బైరి శ్రీనివాసులు, మొగరాల సురేష్, మండ్ల ఈశ్వరయ్య, అశోక్‌నాయుడు, కరణం భాస్కర్ పాల్గొన్నారు.

మరుగుదొడ్ల వినియోగం ఆరోగ్యకరం

- కలెక్టర్ ఆనంద్



వ్యక్తిగత మరుగుదొడ్డి మంజూరు పత్రం అందజేస్తున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (అర్బన్): మరుగుదొడ్లు వినియోగించడం ఆరోగ్యకరమని, గ్రామీణ ప్రజల గౌరవాన్ని కాపాడుతుందని కలెక్టర్ ఆనంద్ తెలిపారు. 'ప్రపంచ టాయిలెట్' దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జిల్లా తాగునీరు, పారిశుధ్య మిషన్ జిల్లా స్థాయి సభ్యుల సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ప్రతి ఇంట్లో 100 శాతం మరుగుదొడ్లు ఉండేలా ప్రజలందరూ ప్రతిజ్ఞ చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మరుగుదొడ్లు వినియోగించే మహిళల్లో ఆత్మగౌరవం పెరుగుతుందన్నారు. వ్యక్తిగత, సామాజిక మరుగుదొడ్ల వినియోగంపై డిసెంబర్ 10వ తేదీ వరకు అధికారులు విస్తృత ప్రచారం చేపట్టాలన్నారు. గ్రామాల్లో సామాజిక మరుగుదొడ్ల వినియోగం, పరిశుభ్రతను గుర్తించి పంచాయతీలకు ఉత్తమ పురస్కారాలు అందజేస్తామన్నారు. వ్యక్తిగత మరుగుదొడ్లు మంజూరైన లబ్ధిదారులకు కలెక్టర్ మంజూరు పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో డీపీఓ శ్రీధర్‌రెడ్డి, డీఈఓ బాలాజీరావు, జెడ్పీ ఇన్‌చార్జి సీఈఓ మోహన్‌రావు, జిల్లా వ్యవసాయశాఖాధికారి సత్యవాణి, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఉమామహేశ్వరి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ దగా

తొలి సంతకం.. మోసం

నిరుద్యోగులను ఊరించిన మెగా డీఎస్సీ చివరికి దగా డీఎస్సీగా మారింది. ఇప్పటికే రెండు సార్లు వాయిదా పడిన డీఎస్సీ నోటిఫికేషన్ వచ్చే ఏడాది మే నెల తర్వాత అయినా ఉండే అవకాశం ఉంటుందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కూటమి నేతల ప్రచారం నమ్మి మరోసారి ఉద్యోగార్థులు మోసపోయారు. డీఎస్సీ నోటిఫికేషన్‌పై సీఎం తొలి సంతకం చేసి మోసం చేశారు. వేలకు వేలు ఖర్చులు పెట్టుకుని.. నెలల తరబడి కోచింగ్ తీసుకుంటున్న అభ్యర్థులకు ప్రభుత్వ వాయిదాల నిర్ణయాలు శాపంగా మారాయి.

- వచ్చే ఏడాది మే నాటికి ఖాళీలు గుర్తించాలని ఆదేశాలు
- జిల్లాలో 668 ఖాళీ పోస్టుల గుర్తింపు
- వీటిల్లో ఎస్జీటీలు 72 మాత్రమే
- డీఎస్సీ నోటిఫికేషన్ ఇప్పటికే రెండు సార్లు వాయిదా
- వ్యయ ప్రయాసలు పడి కోచింగ్ తీసుకుంటున్న అభ్యర్థులు



డీఎస్సీ కోచింగ్ తీసుకుంటున్న అభ్యర్థులు

నెల్లూరు (టౌన్): భావి ఉపాధ్యాయుల కలలు కరిగి పోతున్నాయి. డీఎస్సీ పేరుతో నిరుద్యోగుల జీవితాలతో ఈ ప్రభుత్వం చెలగాటం ఆడుతోంది. ప్రభుత్వ పెద్దల నిర్ణయాలు, ఆదేశాలు చూస్తుంటే వచ్చే ఏడాదైనా డీఎస్సీ జరుగుతుందా? లేదా? అనే అనుమానాలు తలెత్తుతున్నాయి. ఇప్పటికే ఏడాదికిపైగా ఉద్యోగార్థులు వేల రూపాయలు వెచ్చించి కోచింగ్ తీసుకుంటున్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ నిర్వహిస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబు ఊదరగొట్టారు. అధికారంలోకి వచ్చిన రోజునే డీఎస్సీ ఫైల్‌పై తొలి సంతకం పెట్టిన సీఎం నోటిఫికేషన్ ఊసే ఎత్తడం లేదు. నిరుద్యోగులను మభ్య పెట్టేందుకు హడావుడిగా టెట్ పరీక్షను నిర్వహించారు. పరీక్ష ముగిసిన వెంటనే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేశ్ ప్రకటించారు. ఇప్పటికే రెండుసార్లు తేదీలను ప్రకటించి వాయిదా వేశారు. గత ప్రభుత్వం ఫిబ్రవరిలో డీఎస్సీ షెడ్యూల్ ప్రకటించింది. దానికి ముందు నుంచే నిరుద్యోగులు శిక్షణ పొందుతున్నారు. అయితే వచ్చే ఏడాది మే నెల నాటికి ఖాళీలు గుర్తించాలని ప్రభుత్వ పెద్దలు చెప్పడం చూస్తే.. ఆ తర్వాతనే నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. ఇప్పటికే ఏడాదికి పైగా శిక్షణ పొందుతున్న నిరుద్యోగులు, మరో ఆరు నెలలు ఎదురుచూడాల్సిన పరిస్థితి అనివార్యం కానుంది.

668 పోస్టులు ఖాళీ

ఉపాధ్యాయుల ఉద్యోగ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచడంతో జిల్లాలో ఖాళీ పోస్టుల సంఖ్య భారీగా తగ్గింది. జిల్లాలో 2025 మే నెల నాటికి ఏర్పడే ఖాళీలను గుర్తించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ లెక్కన 668 పోస్టులు మాత్రమే ఖాళీ ఏర్పడే అవకాశం ఉన్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు గుర్తించారు. జిల్లాలో స్కూల్ అసిస్టెంట్ (లాంగ్వేజీ-1)-37, లాంగ్వేజీ-17, ఎస్‌ఏ (ఇంగ్లిష్)-83, ఎస్‌ఏ (మ్యాథ్స్)-62, ఎస్‌ఏ (పీఎస్)-75, ఎస్‌ఏ (బీఎస్)-62, ఎస్‌ఏ (సోషల్)-102, ఎస్‌ఏ (పీఈటీ)-105, ఎస్జీటీ-72 కలిపి మొత్తం 615 పోస్టులు ఖాళీలు ఉన్నాయి. వీటితో పాటు మున్సిపల్ పాఠశాలలకు సంబంధించి ఎస్‌ఏ (లాంగ్వేజీ-1)-12, లాంగ్వేజీ-2- 3, ఎస్‌ఏ (ఇంగ్లిష్-1, ఎస్‌ఏ (మ్యాథ్స్)-1, ఎస్‌ఏ (పీఎస్)-5, ఎస్‌ఏ (పీఈటీ)-1, ఎస్జీటీ - 30 కలిపి మొత్తం 53 ఖాళీ పోస్టులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అయితే జెడ్పీ, ప్రభుత్వ, మున్సిపాల్టీల్లో కలిపి 102 సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులు మాత్రమే ఖాళీ ఉన్నాయి. వీటికి మాత్రమే నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు.

రెండింటికి చెడ్డ రేవడిలా..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఈ ఏడాది ఫిబ్రవరి, టీడీపీ ప్రభుత్వంలో అక్టోబర్‌లో టెట్ పరీక్ష నిర్వహించారు. రెండు టెట్ పరీక్షల్లో జిల్లా నుంచి సుమారు 12 వేల నుంచి 14 వేల మంది అభ్యర్థులు అర్హత సాధించారు. వీరంతా గత ఏడాది అక్టోబరు నుంచే డీఎస్సీ కోచింగ్ తీసుకుంటున్నారు. ఒక్కో అభ్యర్థి కోచింగ్‌కు రూ.15 వేలు, వసతి, భోజన సదుపాయాలకు మరో రూ.15 వేలు కలిపి మొత్తం నెలకు రూ.30 వేల వంతున ఖర్చు చేస్తున్నారు. కోచింగ్ తీసుకుంటున్న వారిలో ఎక్కువ మంది అభ్యర్థులు ప్రైవేట్ పాఠశాలల్లో టీచర్లుగా పనిచేస్తున్న వారే. వీరంతా సెలవులు పెట్టడంతో వచ్చే అరకొర జీతాలు కోల్పోయి.. మరో వైపు కోచింగ్ పేరుతో భారీగా ఖర్చు పెట్టుకుంటూ రెండింటికి చెడ్డ రేవడిలా తయారయ్యారు. ప్రభుత్వం నిర్ణయం చూస్తుంటే.. మరో ఆరు నెలల తర్వాతనే డీఎస్సీ ఉండే అవకాశం ఉంది.

నిర్వహణపై నీలినీడలు

డీఎస్సీ పరీక్షకు తొలుత ఈ నెల 6న నోటిఫికేషన్ అంటూ ప్రకటించారు. ఆ తర్వాత వాయిదా వేసి 10న నిర్వహిస్తామని తెలిపారు. అయినా నోటిఫికేషన్‌ను ప్రకటించకపోవడంతో అటు ప్రతిపక్ష నాయకులు, అభ్యర్థుల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో రాష్ట్ర పాలకులు మాట మార్చారు. ఎస్సీ వర్గీకరణపై ఏకసభ్య కమిషన్‌ను నియమించామని, రెండు నెలల్లో నివేదిక ఇవ్వాల్సిందిగా ఆదేశించామని చెబుతున్నారు. ఆ నివేదికైనా రెండు నెలల్లో ఇస్తారని గ్యారెంటీ లేదు. గతంలో ఇలాంటి నివేదికలను నెలల పాటు వాయిదా వేసిన సందర్భాలు ఉన్నాయి. ఒక వేళ నివేదిక ఇచ్చినా ఎస్సీ వర్గీకరణపై అడుగు పడుతుందా? అనే అనుమానం తలెత్తుతోంది. ఒకవేళ నోటిఫికేషన్ విడుదల చేసినా ఎస్సీ వర్గీకరణ అంశం కొలిక్కి రాలేదంటూ వాయిదా వేస్తారా? అనే ప్రశ్న అందరిలో తలెత్తుతోంది. వర్గీకరణపై పలు వర్గాలు కోర్టుకు పోయే ఆలోచనలో ఉన్నట్లు చెబుతున్నారు. వీటన్నింటిని ముందునుంచే గుర్తించిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ అంటూ అందరిని మోసం చేశారని అభ్యర్థులు మండి పడుతున్నారు.

మాకు ఎలాంటి ఉత్తర్వులు రాలేదు



డీఎస్సీ నోటిఫికేషన్‌కు సంబంధించి మాకు ఎలాంటి ఉత్తర్వులు రాలేదు. డీఎస్సీపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాల్సిన నిర్ణయం. ఇప్పటికే జిల్లాలో ఖాళీ పోస్టుల వివరాలను రాష్ట్ర పాఠశాల విద్యాశాఖకు పంపించాం. డీఎస్సీ నిర్వహణపై విద్యాశాఖ ఉన్నతాధికారుల నుంచి మార్గదర్శకాలు రావాల్సి ఉంది. అవి వచ్చిన వెంటనే చర్యలు చేపడతాం.

– ఆర్.బాలాజీరావు, డీఈఓ

అభ్యర్థులకు న్యాయం చేయాలి



డీఎస్సీ నోటిఫికేషన్‌ను వీలైనంత త్వరగా విడుదల చేసి నిరుద్యోగ అభ్యర్థులకు న్యాయం చేయాలి. ఇప్పటికే వేలాది మంది కోచింగ్ తీసుకుని డీఎస్సీ నోటిఫికేషన్ కోసం నిరీక్షిస్తున్నారు. ఎలాంటి వివాదాలకు తావులేకుండా న్యాయపరమైన చిక్కులు లేకుండా డీఎస్సీ పరీక్షను నిర్వహించాలని ఆశిస్తున్నాం.

– ఎం.హరిబాబు, శ్రీహర్ష కోచింగ్ సెంటర్ నిర్వాహకులు

ఏకలవ్య స్కూల్ ప్రిన్సిపల్‌పై వేటు

- ప్రభుత్వానికి ప్రిన్సిపల్ విష్ణుప్రతాప్ శుక్లా సరెండర్
- కొత్త ప్రిన్సిపల్‌గా విష్ణు ప్రియ నియామకం
- మినరల్ వాటర్ ప్లాంట్‌కు మరమ్మతులు
- మెరుగు పడిన విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి



సోమవారం రాత్రి విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకొంటున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

కొడవలూరు: నిర్లక్ష్యంగా విధులు నిర్వర్తిస్తూ.. విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడిన మండలంలోని చంద్రశేఖరపురం ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపల్ విష్ణుప్రతాప్ శుక్లాపై వేటు పడింది. ఆయన్ను ప్రభుత్వానికి సరెండర్ చేస్తూ ఆ స్థానంలో టి.విష్ణుప్రియను నియమిస్తూ కలెక్టర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ స్కూల్‌లోని 25 మంది విద్యార్థులు కలుషిత నీరు తాగి అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. స్కూల్‌లోని మినరల్ వాటర్ ప్లాంట్ ఆరు నెలలుగా మరమ్మతులకు గురైనా ప్రిన్సిపల్ శుక్లా పట్టించుకోలేదు. బురద, కలుషిత నీటినే వంటలకు, తాగేందుకు వినియోగించడంతో విద్యార్థులు డయేరియా బారిన పడ్డారు. ఈ విషయాన్ని సైతం ప్రిన్సిపల్ గోప్యంగా ఉంచారు. అయితే పిల్లలే తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో ఈ విషయం వెలుగులోకి రావడంతో ఆగమేఘాల మీద వైద్య సేవలందించారు. ఏకలవ్య స్కూల్‌లోని విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారనే విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి సోమవారం రాత్రి 10 గంటల సమయంలో స్కూల్‌ను సందర్శించారు. ఆ సమయంలోనూ ప్రిన్సిపల్ శుక్లా ఎమ్మెల్యేను లోనికి రానివ్వకుండా అడ్డుకునేందుకు యత్నించారు. శుక్లా విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, కలుషిత నీరు, నాణ్యత లేని భోజనం పెడుతూ ఇబ్బంది పెడుతున్నా రని ఎమ్మెల్యేకు తెలిపారు. దీంతో ఆమె ప్రిన్సిపల్ వ్యవహారాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ స్పందిస్తూ ప్రిన్సిపల్ శుక్లాను ప్రభుత్వానికి సరెండర్ చేసి, గతంలో ఇక్కడి స్కూల్‌లో ప్రిన్సిపల్‌గా పనిచేసి విద్యార్థులు, తల్లిదండ్రుల మన్ననలు పొందిన టి.విష్ణుప్రియను తిరిగి నియమించారు. మరమ్మతులకు గురైన మినరల్ వాటర్ ప్లాంట్‌కు ఎమ్మెల్యే ఆదేశాలతో మంగళవారం ఆగమేఘాల మరమ్మతులు చేపట్టారు.



కొత్త ప్రిన్సిపల్‌గా నియమితులైన విష్ణుప్రియ

యానాదుల సంఘం ధర్నా

ఏకలవ్య స్కూల్ ప్రిన్సిపల్ విష్ణుప్రతాప్ శుక్లా నిర్లక్ష్యాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర యానాదుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్కూల్ ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఆ సంఘ అధ్యక్షుడు కేసీ పెంచలయ్య మాట్లాడుతూ విద్యార్థుల హక్కులను హరించి నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్న ప్రిన్సిపల్ శుక్లాను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఆ సంఘ నాయకులు ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి మెరుగు

ఏకలవ్య స్కూల్లో అస్వస్థతకు గురైన విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి మెరుగు పడిందని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య తెలిపారు. మంగళవారం ఆయన పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. కలుషిత నీటి వల్లే విద్యార్థులు డయారియాకు గురవ్వడం జరిగిందన్నారు. విద్యార్థుల ఆరోగ్య విషయంలో ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. డీఎంహెచ్‌ఓ వెంట డిప్యూటీ డీఎంహెచ్‌ఓ బ్రిజిత, ఎంపీడీఓ ఏవీ సుబ్బారావు, వైద్యాధికారి ఎం.రామకృష్ణ, హెచ్‌ఏ షఫీ ఉద్దీన్ తదితరులు ఉన్నారు.

నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఉత్తర్వులు బేఖాతర్



ఈ పొలం తమదని జామాయిల్ కర్ర కొట్టకుండా ఇచ్చిన స్టేఆర్డర్ కాపీలు చూపుతున్న అజయ్ ఘోష్, అతని కుమారుడు



పోలీసుల సహకారంతో జామాయిల్ కర్రను లారీకి లోడ్ చేస్తున్న దృశ్యం

- సీఐ బందోబస్తు మధ్య కర్రకొట్టి తరలింపు

ఆత్మకూరు: రెండు వర్గాల మధ్య నెలకొన్న భూవివాదంలో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఉత్తర్వులనే బేఖాతర్ చేస్తూ ఓ వర్గానికి కొమ్ము కాస్తూ వివాదానికి ఆజ్యం పోస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. చేజర్ల మండలం మడపల్లిలో సుమారు 262 ఎకరాల పినాకిని షీప్ ఫాం పేరుతో రిజిస్టరైన భూముల విషయమై రెండు వర్గాల మధ్య వివాదం జరుగుతోంది. ఇటీవల ఒక వర్గం జామాయిల్ కర్రను పోలీస్ బందోబస్తు మధ్య కొట్టించి తరలించారు. ఈ రోజు స్థానికంగా ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఈ క్రమంలో అసలు హక్కుదారులు తామే అయితే తమ ప్రత్యర్థులకు అండగా ఎలా నిలుస్తారని షీప్ ఫాం అధినేత అజయ్‌ఘోష్ అడ్డుకోవడంతో అతనితో పాటు మద్దతుగా వచ్చిన వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీంతో వారు తాజాగా నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించడంతో స్టే ఆర్డర్ ఇచ్చింది. ఈ క్రమంలో మంగళవారం జామాయిల్ కర్ర కొట్టేందుకు కూలీలు రాగా అజయ్‌ఘోష్ అనుచరులు అడ్డుకున్నారు. సమాచారం తెలుసుకున్న సంగం సీఐ వేమారెడ్డి పోలీసు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని, వారు కర్రకొట్టి తీసుకెళ్లేందుకు ఎవరూ అడ్డు చెప్పరాదని హెచ్చరించారు. అయితే తాము నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (కోర్టు) నుంచి స్టే ఆర్డర్ తెచ్చామని దాని ప్రకారం కర్ర కొట్టేందుకు వీల్లేదని షీప్ ఫాం అధినేత అజయ్‌ఘోష్, అతని అనుచరులు అడ్డు చెబుతున్నా సీఐ వినిపించుకోలేదు. ఆ భూమి రెవెన్యూ రికార్డుల ప్రకారం శ్రీనివాసులురెడ్డికే చెందుతుందని, ఆ మేరకు 1బీలు, అడంగళ్లు వారి పేరుతోనే ఉన్నట్లు రెవెన్యూ అధికారులు తమకు ఇచ్చిన రికార్డులను చూపించారు. వారు తమకు తోటలోని కర్ర కొట్టి తరలించేందుకు ప్రొటెక్షన్ ఇవ్వాలని కోరడంతో తాము వచ్చినట్లు తెలిపారు. అజయ్‌ఘోష్, అతని వర్గీయులు స్టే ఆర్డర్, తమ పేరుతో ఉన్న రికార్డులు చూపిస్తున్నా సీఐ పట్టించుకోలేదంటూ ఆరోపణలు చేశారు. ఆరు లారీల కర్రకొట్టి బద్వేల్ ఫ్యాక్టరీకి తరలించడంలో శ్రీనివాసులురెడ్డి వర్గీయులకు సీఐ సహకరించారు.

శభాష్.. డాక్టర్ పూర్ణిమ

- చెన్నైలో క్షతగాత్రుడికి సేవలందించి ప్రాణాలు కాపాడిన గుడ్లూరు వైద్యురాలు

గుడ్లూరు: 'వైద్యో నారాయణో హరిః' అనే ఆర్యోక్తి చెన్నైలో రోడ్డు ప్రమాదం జరిగి గాయపడిన క్షతగాత్రుడికి గుడ్లూరు మండలం సాలిపేటకు చెందిన డాక్టర్ మునగాల పూర్ణిమ ఐశ్వర్య వైద్యం చేసి ప్రాణాన్ని కాపాడడంతో నిరూపితమైంది. పూర్ణిమ ఎంబీబీఎస్, ఎంఎస్ (జనరల్ సర్జన్), ఎంఆర్‌సీఎస్ (లండన్) చదివింది. ఈమెకు ఇటీవల లండన్‌లోని జేమ్స్ కుక్ మెడికల్ యూనివర్సిటీ హాస్పిటల్‌లో వైద్యురాలిగా ఉద్యోగం వచ్చింది. డిసెంబర్ 2వ తేదీన జాబ్‌లో చేరాలి. వీసా స్లాట్ కన్ఫర్మేషన్‌కు మంగళవారం సాయంత్రం 3 గంటలకు చెన్నైలో అపాయింట్‌మెంట్ ఉంది. ఈ క్రమంలో ఆమె ఉదయం పినాకిని ఎక్స్‌ప్రెస్ రైల్లో వెళ్లి చెన్నై సెంట్రల్‌లో దిగి ఆటోలో వెళుతున్నారు. అదే సమయంలో అన్నాసాలై రోడ్డులో రద్దీగా ఉండే ఒక ఫ్లై ఓవర్‌పై స్కూటీపై నుంచి పడిన ఓ 25 ఏళ్ల యువకుడికి తల వెనుక భాగంలో తీవ్రగాయమైంది. రక్తం కారుతూ అపస్మారక స్థితిలో పడి ఉన్న అతన్ని వైద్యశాలకు తరలించేందుకు స్థానికులు ఎదురు చూస్తున్నారు. అక్కడే ట్రాఫిక్ కంట్రోల్ చేస్తూ పోలీస్, మిలటరీ ఆఫీసర్లు ఉన్నారు. అదే సమయంలో ఆటోలో వెళుతూ ఘటనను గమనించిన పూర్ణిమ ఐశ్వర్య అపస్మారక స్థితిలో పడి ఉన్న క్షతగాత్రుడికి ప్రాథమిక వైద్యం చేసి చలనంలోకి వచ్చి కళ్లు తెరచేలా చేశారు. అటుగా పోతున్న అంబులెన్స్‌ను ఆపి అతన్ని హాస్పిటల్‌లో చేర్చాలని పోలీస్ అధికారులకు అప్పగించారు. వైద్యురాలిగా స్పందించిన పూర్ణిమ ఐశ్వర్యను అందరూ అభినందించారు. ఆమె తండ్రి మునగాల గోవర్ధన్ గుడ్లూరు ఎంఈఓగా విధులు నిర్వహిస్తున్నారు.



అపస్మారక స్థితిలో ఉన్న క్షతగాత్రుడికి వైద్యం అందజేస్తున్న పూర్ణిమ ఐశ్వర్య

ఏసీబీ వలలో ఉప ఖజానా అధికారిణి

- పెండింగ్ బిల్లుల మంజూరుకు రూ.40 వేల లంచం డిమాండ్
- ప్రైవేట్ వ్యక్తి ద్వారా లావాదేవీలు
- అతడితోపాటు ఎస్టీఓను అదుపులోకి తీసుకున్న ఏసీబీ అధికారులు



ఏసీబీ అధికారులకు పట్టుబడిన నగదు



ఏసీబీకి చిక్కిన ఎస్టీఓ మమత



విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ శిరీష

ఉదయగిరి: ఉదయగిరి ఉపఖజానా అధికారిణి సీహెచ్ మమత మంగళవారం సాయంత్రం తన కార్యాలయంలో ఓ ఉపాధ్యాయుడి నుంచి లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడింది. ఏసీబీ డీఎస్పీ శిరీష తెలిపిన సమాచారం మేరకు.. వరికుంటపాడు మండలం తూర్పు బోయమడుగుల గ్రామంలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న లోకసాని వెంగయ్యకు సుమారు రూ.9 లక్షల వరకు పాత బిల్లులు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది. ఈ బిల్లులు మంజూరు చేయాలని వెంగయ్య ఉప ఖజానా అధికారిణి సీహెచ్ మమతను వారం రోజుల క్రితం కలిశారు. అందుకు పది శాతం లంచం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సదరు ఉపాధ్యాయుడు అంత డబ్బు ఇవ్వలేక వెనుదిరిగాడు. తర్వాత అదే కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శ్రీహరిని సంప్రదించి రూ.40 వేలు లంచం ఇచ్చేటట్లు ఒప్పందం చేసుకున్నాడు. లంచం ఇవ్వడం ఇష్టం లేక ఆ ఉపాధ్యాయుడు ఏసీబీ అధికారులను సంప్రదించాడు. వారి సూచనల మేరకు మంగళవారం ఎస్టీఓకు లంచం ఇచ్చేందుకు కార్యాలయానికి వెళ్లి ఆమెను కలిసి రూ.40 వేలు తీసుకొచ్చానని చెప్పడంతో అదే కార్యాలయంలో పనిచేస్తున్న ప్రైవేట్ వ్యక్తి పవన్‌కు ఇవ్వాలని సూచించింది. దీంతో బాధితుడు కార్యాలయం కింద ఉన్న ప్రైవేట్ వ్యక్తి పవన్‌కు రూ.40 వేలు లంచం ఇచ్చాడు. అప్పటికే అక్కడ కాపు కాసి ఉన్న ఏసీబీ అధికారుల బృందం పవన్‌ను అదుపులోకి తీసుకొని పైనున్న ఎస్టీఓ వద్దకు తీసుకెళ్లారు. ఎస్టీఓ సూచన మేరకే ఈ నగదు తీసుకున్నట్లు పవన్ ఏసీబీ అధికారులకు చెప్పడంతో ఆమెను అదుపులోకి తీసుకొని నగదుకు రసాయన పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఎస్టీఓను, పవన్‌ను అదుపులోకి తీసుకొని విచారించారు. దాడుల్లో ఏసీబీ ఇన్‌స్పెక్టర్లు ఆంజనేయరెడ్డి, విజయకుమార్ తోపాటు మరో పది మంది సిబ్బంది ఉన్నారు. మమత మూడేళ్ల క్రితం ఉదయగిరి ఉప ఖజానా అధికారిణిగా బాధ్యతలు తీసుకున్నారు. అప్పటి నుంచి ఆమె సక్రమంగా విధులకు రావడం లేదని, ప్రతి చిన్న బిల్లుకు కూడా పెద్ద మొత్తంలో లంచం డిమాండ్ చేస్తుందనే ఆరోపణలు కూడా ఉన్నాయి. ప్రభుత్వ ఉద్యోగులు, ఐసీడీఎస్‌కు సంబంధించిన బిల్లుల విషయంలో కూడా లంచాలు డిమాండ్ చేసి సకాలంలో బిల్లులు పాస్ చేయలేదనే విమర్శలు కూడా వెల్లువెత్తాయి.

లంచం ఇవ్వడం ఇష్టం లేక పట్టించాను

- లోకసాని వెంగయ్య, ఉపాధ్యాయుడు



నాకు ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.8,92,710 పాత బిల్లులు పాస్ చేయాలని ఎస్టీఓను కోరాను. ఆమె పది శాతం లంచం అడిగారు. అంత ఇవ్వలేనని చెప్పినా ఒప్పుకోకపోవడంతో ఇదే కార్యాలయంలో పనిచేసే సీనియర్ అసిస్టెంట్ శ్రీహరి మధ్యవర్తిత్వం ద్వారా రూ.40 వేలకు ఒప్పందం చేసుకున్నాను. అయినా లంచం ఇవ్వడం ఇష్టం లేక ఏసీబీ అధికారులను సంప్రదించి వారి సూచనల మేరకు వ్యవహరించి లంచం నగదు ఇచ్చాను.

పెండింగ్‌లో ఉపకార వేతనాల దరఖాస్తులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): పోస్టు మెట్రిక్ ఉపకార వేతనాల కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ విద్యార్థుల దరఖాస్తులను జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ కళాశాలల ప్రిన్సిపల్స్ ఈనెల 30లోపు రిజిస్ట్రేషన్ చేయాలని జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారత అధికారి శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 38,295 మంది విద్యార్థులుండగా వారిలో 2,513 మంది డిస్కంటిన్యూ చేశారని మిగిలిన వారిలో 24,182 మంది దరఖాస్తులు మాత్రమే రిజిస్ట్రేషన్ చేశారన్నారు. అలాగే ఫ్రెష్ రిజిస్ట్రేషన్ కోసం 13,549 మంది ఉండగా వారిలో కేవలం 2,337 మంది మాత్రమే ఇప్పటి వరకు నమోదు చేసుకున్నారన్నారు. ప్రిన్సిపల్ లాగిన్‌లో ఇంకా 12,413 మంది ఆధార్ అథెంటిఫికేషన్, 3,907 మందికి ప్రిన్సిపల్ ఓటీపీ, 12,413 మందికి అటెండెన్స్ పెండింగ్‌లో ఉన్నట్లు వెల్లడించారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.45
సన్నవి : రూ.35
పండు : రూ.20

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్) : 112
లేయర్ (లైవ్) : 110
బ్రాయిలర్ చికెన్ : 210
బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 234
లేయర్ చికెన్ : 187

ఫోన్ పోయిందా.. డోంట్ వర్రీ

- బాధితులకు అండగా మొబైల్ హంట్, సీఈఐఆర్
- గతేడాది ఫిబ్రవరి నుంచి వీటి సేవలు
- హాయ్ అని మెసేజ్ చేస్తే చాలు
- ఏడు విడతల్లో రూ.8 కోట్ల విలువైన ఫోన్ల అప్పగింత



ఏడో విడతలో రికవరీ చేసిన ఫోన్లతో ఎస్పీ, పోలీసు అధికారులు

మొబైల్ హంట్ నంబర్ : 91543 05600

నెల్లూరు(క్రైమ్): ప్రస్తుతం సెల్‌ఫోన్ అత్యంత కీలకమైంది. అనేక పనులు దీనితోనే ముడిపడి ఉన్నాయి. నగదు చెల్లింపులు చేయాలన్నా.. దేనికైనా దరఖాస్తు చేయాలన్నా.. ఎలాంటి సమాచారం తెలుసుకోవాలన్నా ఫోన్ చాలా ముఖ్యం. ఇది చోరీకి గురైతే పరిస్థితి ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు. గతంలో ఆశలు వదులుకోవాల్సి వచ్చేది. పోలీస్‌స్టేషన్‌కు వెళ్తే కొన్నిసార్లు ఫిర్యాదు తీసుకునేవారు కాదు. దీంతో ఫోన్, అందులో ఉన్న సమాచారం పోయిందని బాధపడాల్సి వచ్చేది. అయితే పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండానే ఫోన్లను వెతికి పెట్టేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగం గతేడాది ఫిబ్రవరిలో మొబైల్ హంట్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇప్పటికి ఏడు విడతల్లో రూ.8 కోట్ల విలువ చేసే మూడువేల సెల్‌ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సీఈఐఆర్ విధానం ద్వారా రూ.8 లక్షలు విలువైన 40 సెల్‌ఫోన్లను రికవరీ చేసి బాధితులకు ఇచ్చారు.

మొబైల్ హంట్‌లో ఇలా..

సెల్‌ఫోన్ పోగొట్టుకున్నవారు ముందుగా మొబైల్ హంట్ సెల్‌ఫోన్ నంబర్ 91543 05600కు వాట్సప్ ద్వారా హాయ్ అని మెసేజ్ పంపాలి. వెంటనే జిల్లా పోలీస్ పేరున మీ వివరాల కోసం లింక్ వస్తుంది. దానిపై క్లిక్ చేయాలి. గూగుల్ ఫారం ఓపెన్ చేసి ఫిర్యాదుదారుడి పేరు, చిరునామా, చోరీ/పోయిన తేదీ, సమయం, పోయిన స్థలం, ఫోన్ మోడల్, కంపెనీ, రంగు, ఐఎంఈఐ నంబర్, ఈ-మెయిల్ ఐడీ, ఏదైనా ప్రభుత్వ గుర్తింపు పత్రం, పోయిన ఫోన్‌లో ఉపయోగించిన నంబర్, సమాచారం కోసం మరో ఫోన్ నంబర్, పోలీసుస్టేషన్ పరిధి తదితర వివరాలను నమోదు చేసిన వెంటనే ఫిర్యాదు నమోదవుతుంది. సైబర్ క్రైమ్ టెక్నికల్ విభాగం వారి వద్ద నున్న సాంకేతిక పరిజ్ఞానంతో మొబైల్‌ను ట్రేస్ చేస్తారు.

సీఈఐఆర్‌లో నమోదు ఇలా..

కేంద్రం టెలికామ్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్ట్రార్ (సీఈఐఆర్) విధానాన్ని ప్రవేశపెట్టింది. ఫోన్ పోగొట్టుకున్న బాధితులు తొలుత స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి. అనంతరం డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సీఈఐఆర్.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో లాగిన్ అవ్వాలి. అందులో రిక్వెస్ట్ ఫర్ బ్లాకింగ్ లాస్ట్/స్టోలెన్ మొబైల్ లింక్‌పై క్లిక్ చేయాలి. ఐఎంఈఐ నంబర్లు, కంపెనీ పేరు, మోడల్, మొబైల్ కొనుగోలుకు సంబంధించిన బిల్లును అప్‌లోడ్ చేయాలి. ఎక్కడ పోయింది? తదితర వివరాలు నమోదు చేయాలి. అంతా పూర్తయిన తర్వాత ఐడీ నంబర్ వస్తుంది. ఏ కంపెనీదైనా సీఈఐఆర్ విధానం దానిని పనిచేయకుండా చేస్తుంది. దీంతోపాటు కేసు ఛేదనలో పోలీసులకు ఉపయోగపడుతుంది. సెల్‌ఫోన్ దొరికిన తర్వాత బాధితుడు అదే వెబ్‌సైట్‌లోకి వెళ్లి అన్‌బ్లాక్/ఫౌండ్ మొబైల్ అనే లింక్‌పై క్లిక్ చేసి ఐడీ నమోదు చేయగానే ఫోన్ అన్‌బ్లాక్ అవుతుంది.

700 మొబైల్ ఫోన్ల అందజేత

వివిధ కారణాలతో ప్రజలు పోగొట్టుకున్న రూ.1.50 కోట్ల విలువైన 700 మొబైల్ ఫోన్లను పోలీసు అధికారులు రికవరీ చేశారు. మంగళవారం నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో ఎస్పీ జి.కృష్ణకాంత్ చేతుల మీదుగా ఫోన్లను బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, నెల్లూరు నగర, రూరల్ డీఎస్పీలు డి.శ్రీనివాసరెడ్డి, ఘట్టమనేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


మహిళకు ఫోన్‌ను అందజేస్తున్న ఎస్పీ

3,040 ఫోన్లను రికవరీ చేశాం

సెల్‌ఫోన్‌లో నిక్షిప్తమైన సమాచారం, వ్యక్తిగత, కుటుంబ ఫొటోలు, వీడియోలు తదితరాలు అసాంఘిక వ్యక్తుల చేతిలో పడితే ప్రమాదం. దీనిని దృష్టిలో ఉంచుకుని పోలీసు శాఖ మొబైల్ హంట్ సేవలను, కేంద్ర ప్రభుత్వం సీఈఐఆర్ (సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చాయి. వీటి ద్వారా జిల్లాలో వివిధ కారణాలతో ప్రజలు పోగొట్టుకున్న ఏడు విడతల్లో రూ.8.08 లక్షల విలువైన 3,040 సెల్‌ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేశాం. మొబైల్ హంట్, సీఈఐఆర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి.

– జి.కృష్ణకాంత్, ఎస్పీ

అధికారం.. అహంకారం


సురేష్ లేఅవుట్‌లో రాళ్ల తొలగింపు

- వైఎస్సార్‌సీపీ మద్దతుదారులే లక్ష్యం
- దివివారిపాలెం రోడ్డులోని లేఅవుట్‌పై దాడి
- ఎమ్మెల్యేకు డబ్బులివ్వాలంటూ బెదిరింపు

కందుకూరు: అధికార పార్టీ నాయకుల అవినీతికి అంతు లేకుండా పోయింది. తాజాగా వారి కన్ను రియల్ ఎస్టేట్ రంగంపై పడింది. తమకు అనుకూలం కాని వారిపై వేధింపులకు పాల్పడుతున్నారు. మండలంలోని పలుకూరుకు చెందిన సురేష్ అనే రియల్ ఎస్టేట్ వ్యాపారి వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడు. మంగళవారం అతడికి చెందిన సర్వే నంబర్ 688, 695లో ఉన్న 4.50 ఎకరాల వెంచర్‌లో మున్సిపల్ అధికారులు హద్దు రాళ్లు తొలగించారు. ఈ వెంచర్ వేసి దాదాపు మూడు సంవత్సరాలవుతోంది. ల్యాండ్ కన్వర్షన్ కట్టడంతోపాటు, 30 అడుగుల రోడ్లు, విద్యుత్ లైన్‌ల వంటి అన్ని సదుపాయాలు కల్పించి అప్రూవల్ తీసుకున్నారు. అన్నీ అనుమతులున్నా ఎందుకు రాళ్లు తొలగిస్తున్నారని మున్సిపల్ అధికారులను సురేష్ ప్రశ్నించాడు. తాము ఏమీ చేయలేమని.. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు దగ్గర నుంచి ఒత్తిళ్లు ఉన్నాయని సమాధానమిచ్చారు. ఎమ్మెల్యేను కలవాలని.. నీకు ఎన్నిసార్లు చెప్పినా ఎందుకు కలవడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వాస్తవానికి సురేష్ వేసిన వెంచర్ మహదేవపురం పంచాయతీ పరిధిలోకి వస్తుంది. భూముల రిజిస్ట్రేషన్ నుంచి ల్యాండ్ కన్వర్షన్ వరకు అన్ని ఆ పంచాయతీ పరిధిలోనే ఉన్నాయి. ఆ వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు కూడా దాని పరిధిలోనే రిజిస్ట్రేషన్‌లు చేయించుకున్నారు.

ఎకరాకు రూ.10 లక్షలు ఇవ్వాలంట

పట్టణంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలంటే ఎమ్మెల్యే మనుషులకు ఎకరాకు రూ.10 లక్షలు ఇవ్వాలని బేరం పెడుతున్నారు. నేను నగదు ఇవ్వలేదని మూడు సంవత్సరాల క్రితం వేసిన వెంచర్‌లో రాళ్లు తొలగిస్తున్నారు.

– సురేష్, బాధితుడు

పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి


మాట్లాడుతున్న పీడీ

- డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి

నెల్లూరు(పొగతోట): గ్రామీణ ప్రాంతాల్లో పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని, వ్యక్తిగత పరిశుభ్రతపై మహిళలకు అవగాహన కల్పించాలని డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి సూచించారు. మంగళవారం నెల్లూరులోని డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో ఏసీలు, ఏపీఎంలు, టీసీలకు నిర్వహించిన శిక్షణలో పీడీ మాట్లాడారు. వాటర్ ట్యాంక్‌లను క్రమం తప్పకుండా శుభ్రం చేస్తూ ప్రజలకు సురక్షిత నీరు సరఫరా చేయాలన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిస్థాయిలో నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలు ప్లాస్టిక్ సంచుల్లో వ్యర్థాలను నింపి దూర ప్రాంతాల్లో వేస్తున్నారన్నారు. వాటిని పశువులు తిని అనారోగ్యం పాలవుతున్నట్లు చెప్పారు. వ్యక్తిగత మరుగుదొడ్లను ప్రతి ఒక్కరూ వినియోగించాలన్నారు. డయేరియా, డెంగీ, మలేరియా తదితర వ్యాధులు ప్రబలుతున్నాయన్నారు. వాటిని నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. డాక్టర్ నిరుపమ మాట్లాడుతూ ఆరోగ్య సమస్యలున్న వారు నిర్లక్ష్యం చేయకుండా పీహెచ్‌సీల్లోని వైద్యాధికారులను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చంద్రశేఖర శర్మ, డీఆర్‌డీఏ కో-ఆర్డినేటర్ శైలజ పాల్గొన్నారు.

మెడికల్ ఏజెన్సీలో అగ్నిప్రమాదం

- ఊపిరాడక మహిళ మృతి

నెల్లూరు(క్రైమ్): విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మెడికల్ ఏజెన్సీలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. దట్టమైన పొగతో ఊపిరాడక వివాహిత మృతిచెందిన ఘటన నెల్లూరులోని కోరంవారి వీధిలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. ట్రంకు రోడ్డు కోరంవారి వీధికి చెందిన రాజ్యలక్ష్మి (43), రామకృష్ణ దంపతులు తమ ఇంటి కింది భాగంలో శ్రీదుర్గా పేరిట మెడికల్ ఏజెన్సీ నిర్వహిస్తున్నారు. ఈనెల 18వ తేదీ సోమవారం రాత్రి రాజ్యలక్ష్మి తన సెల్‌ఫోన్‌ను షాపులో మర్చిపోయి ఇంట్లోకి వెళ్లింది. మంగళవారం ఉదయం ఫోన్‌ను తీసుకునేందుకు ఆమె షాపు లోపలికి వెళ్లింది. అప్పటికే అక్కడ విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి మందులు, వస్తువులు కాలిపోయి దట్టమైన పొగ ఆవరించింది. దీంతో ఆమెకు ఊపిరాడక సొమ్మసిల్లి పడిపోయింది. భార్య రాలేదని రామకృష్ణ షాపు వద్దకు వెళ్లాడు. కిందపడిపోయి ఉన్న ఆమెను చూసి చికిత్స నిమిత్తం రామచంద్రారెడ్డి హాస్పిటల్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే రాజ్యలక్ష్మి మృతిచెందినట్లు నిర్ధారించారు. ఈ మేరకు రామకృష్ణ సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇన్‌స్పెక్టర్ మద్ది శ్రీనివాసరావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు.



వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

ముత్తుకూరు: టిప్పర్ ఢీకొని ఓ మహిళ మృతిచెందిన ఘటన ముత్తుకూరులో మంగళవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. నారికేళపల్లికి చెందిన గంపాల శీనయ్య, సూరం అనసూయమ్మ (60) ముత్తుకూరులోని నగల దుకాణానికి స్కూటీపై బయలుదేరారు. పీహెచ్‌సీ సమీపంలో టిప్పర్ వెనుక నుంచి స్కూటీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కింద పడిన అనసూయమ్మ అక్కడికక్కడే మృతిచెందింది. శీనయ్య గాయపడ్డాడు. సమాచారం అందుకున్న ఎస్సై విశ్వనాథరెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బస్సు ఢీకొని..

వెంకటాచలం: మోటార్‌బైక్‌ను ప్రైవేట్ బస్సు ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన వెంకటాచలంలోని ఇందిరమ్మ కాలనీ సమీపంలో మంగళవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. వెంకటాచలం పంచాయతీ ఇందిరమ్మ కాలనీకి చెందిన దాసరి కోటయ్య (70) బైక్‌పై వస్తుండగా ఎదురుగా వచ్చిన ప్రైవేట్ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కోటయ్య తీవ్ర గాయాలై మృతిచెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ కలహాలతో భర్త ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): భార్యతో గొడవల కారణంగా మనస్తాపానికి గురైన భర్త ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన నెల్లూరులోని శ్రామిక నగర్‌లో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. శ్రామిక నగర్‌కు చెందిన దిలీప్ కుమార్ (25), స్వప్నకు రెండేళ్ల క్రితం వివాహమైంది. భార్య పొగతోటలోని ఓ హాస్పిటల్లో నర్సుగా పనిచేస్తోంది. భర్త వివిధ పనులు చేసేవాడు. కొంతకాలం వారి కాపురం సజావుగా సాగింది. అనంతరం దంపతుల నడుమ విభేదాలు చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం స్వప్న డ్యూటీకి వెళ్లింది. దిలీప్ కుమార్ తన ఇంట్లోనే సెల్‌ఫోన్‌తో వీడియో తీస్తూ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం ఇంటికి వచ్చిన స్వప్న భర్త మృతదేహాన్ని చూసి కన్నీటి పర్యంతమైంది. ఈ విషయాన్ని మృతుడి తల్లిదండ్రులకు తెలియజేసింది. బాధిత తల్లి చంద్రమ్మ వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ కిశోర్‌కుమార్ తెలిపారు.